

హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా నేతలు

# గెలుపు మనదే



## వరంగల్‌లో బలంగా బీఆర్‌ఎస్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే పోటీ.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్‌లో వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ నేతలతో భేటీ

*వరంగల్, మార్చి 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కేంద్రంగా ఉన్న వరంగల్ ప్రజలు ఎప్పుడూ బీఆర్‌ఎస్ వెంటే ఉంటారు.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ గులాబీ పార్టీకి మద్దతు తెలుపుతారు' అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. వరంగల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బుధవారం సాయంత్రం డాక్టర్ కడియం కావ్యను ప్రకటించిన ఆయన, 'ఈ ఎన్నికల్లో గెలుపు మనదే'నని స్పష్టం చేశారు.*

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో పార్టీ అధినేత కేసీఆర్ బుధవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఎన్నికలో బీఆర్‌ఎస్‌కు కచ్చితంగా గెలుపు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ పరిపాలనపై ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతున్నదని చెప్పారు. సాగునీరు, కరెంటు సరఫరా నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో ఏ రోజూ రైతులకు ఇబ్బంది కలుగలేదని చెప్పారు.

వరంగల్ సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందని, ఇక్కడ బీజేపీ నామమాత్రంగానే ఉంటుందన్నారు. వరంగల్ సెగ్మెంట్‌లో త్రిముఖ పోటీ ఉంటే బీఆర్‌ఎస్ భారీ ఆధిక్యంతో గెలుస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిందని, ప్రస్తుతం ప్రజల్లో ఆ పార్టీపై అసంతృప్తి పెరుగుతున్నదని తెలిపారు. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులు సమష్టిగా పార్టీ గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలకు గెలుపోటములు సహజమని, బీఆర్‌ఎస్‌కు ప్రజల మద్దతు ఉంటుందన్నారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీల వ్యూహంలో పడవద్దని చెప్పారు. మాజీ మంత్రులు కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బండా ప్రకాశ్, బస్వరాజు సారయ్య, జడ్పీ చైర్ పర్సన్లు ఎం.సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు.

## కావ్యకే కడియం

- వరంగల్ లోక్‌సభ స్థానం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య
- ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్

వరంగల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్యను పార్టీ అధినేత కేసీఆర్ బుధవారం ప్రకటించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావ్య ప్రస్తుతం వైద్య వృత్తిలో ఉన్నారు. 'కడియం ఫౌండేషన్' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కడియం శ్రీహరి 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున వరంగల్ ఎంపీగా ఎన్నికయ్యారు. పదేండ్ల తర్వాత ఇప్పుడు కడియం కావ్య బీఆర్‌ఎస్ తరఫున పోటీలో ఉంటున్నారు.

### బయోడేటా

**పేరు :** డాక్టర్ కడియం కావ్య
**తండ్రి పేరు :** కడియం శ్రీహరి
**తల్లి పేరు :** వినయారాణి
**పుట్టిన తేదీ :** 10.04.1983
**పుట్టిన స్థలం :** హనుమకొండ
**భర్త పేరు :** డాక్టర్ ఎం.డీ నజీరుల్లా షేఖ్
**కూతుళ్లు :** దివ్య, మిహిరా
**విద్యార్హతలు :** ఎంబీబీఎస్, ఎం.డీ (పాథాలజీ)
**ప్రొఫెషన్ :** అసిస్టెంట్ ప్రొఫెసర్ (ప్రతిమా రిలీఫ్ మెడికల్ కాలేజీ) హనుమకొండ
**ప్రత్యేకతలు :** సామాజిక సేవా కార్యక్రమాలు, కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్
**అడ్రస్ :** ఇంటి నంబర్ 2-7-1041/3, రోడ్డు నెంబర్ 2, కనకదుర్గా కాలనీ, వడ్డేపల్లి, హనుమకొండ

# రయ్.. రయ్..

## నగరంలో వాహన కొనుగోళ్ల జోరు

- నిత్యావసర వస్తువైన మోటార్ సైకిల్
- ఇళ్ల కంటే వాహనాలే ఎక్కువ
- నయా మోడళ్లపై యమా క్రేజ్
- ప్రజా రవాణా వ్యవస్థలో ఆటోలు కీలకం



వరంగల్, మార్చి 13 : నేటి ఆధునిక కాలంలో మోటర్ సైకిల్ ప్రతి ఒక్కరికీ నిత్యావసర వస్తువుగా మారింది. ఒకప్పుడు బైక్ ఇంట్లో ఉంటే గొప్ప అనేవారు. ఇప్పుడు మనిషికి ఒక బైక్ అనేది కామన్. కొందరికి రెండు కూడా ఉంటున్నాయి. అదనంగా కారు కూడా ఉండాల్సిందే. అదే ఇప్పుడు స్టేటస్ సింబల్‌గా మారింది. అలాగే ప్రజారవాణాలో ఆటోలు కీలకంగా మారాయి. ఇలా కాలానుగుణంగా వస్తున్న మార్పులతో జీవన విధానమూ మారుతుండడంతో వాహనాలు వినియోగం పెరిగింది. మార్కెట్‌లోకి వచ్చే కొంగొత్త మోడళ్లపైనా యువత ఆసక్తి చూపుతూ రయ్‌రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. సులభంగా రుణం ఇచ్చేందుకు ఫైనాన్స్ సంస్థలు కూడా ముందుకొస్తుండడంతో నిశ్చింతగా కొంటున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో రోజురోజుకూ వాహనాలు కొనుగోళ్లు జోరందుకుంటున్నాయి.

### పెరిగిన వాహనాల సంఖ్య

ప్రస్తుతం ద్విచక్ర వాహనాల సంఖ్యను చూస్తూ ఇళ్ల కంటే ఎక్కువగానే ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల కాలంలో వాహనాల సంఖ్య భారీగా పెరిగినట్లు రవాణా శాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వ్యక్తిగత రవాణాకు అలవాటు పడడంతో సొంత వాహనాల కొనుగోళ్లకు ఇష్టపడుతున్నారు. కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే కారు కొనుగోలు చేయాలని ఆలోచిస్తున్నారు. ఫైనాన్స్ సంస్థలు వాహన కొనుగోళ్లకు రుణాలు సులభంగా ఇస్తుండడంతో కొనుగోళ్లు రెట్టింపు అయ్యాయి. ఈఎంఐ పద్ధతితో సులువుగా రుణం చెల్లిస్తున్నారు. దీంతో ఆటోమొబైల్ మార్కెట్‌కు మంచి ఊపు వచ్చింది. మార్కెట్‌కు అనుగుణంగా ఆరునెలలకు ఒక కొత్త మోడల్‌ను విడుదల చేస్తున్నారు. దీనికి తోడు వ్యవసాయ రంగంలో ట్రాక్టర్ల వినియోగం పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కోసం త్రీ వీలర్స్ వాహనాలు వినియోగిస్తున్నారు.

### వాహనాలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ

పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రహదారుల విస్తరణ జరుగుతోంది. భవిష్యత్ అంచనాలకు తగ్గట్టుగా రోడ్లను విస్తరిస్తున్నారు. కొత్త మాస్టర్‌ప్లాన్‌లో ప్రధాన రహదారులు 150 ఫీట్లుగా సూచించారు. ప్రతి అంతర్గత రహదారులు 30 ఫీట్లుగా పేర్కొన్నారు. జిల్లా, మండల కేంద్రాలలో ప్రధాన రహదారులన్నీ విశాలంగా రూపుదిద్దుకుంటున్నాయి. గ్రేటర్ పరిధిలో అన్ని రహదారులు వెడల్పు చేసే యోచనలో అధికార యంత్రాగం ఉంది. దీనికి తోడు నగరం చుట్టూ ఇన్నర్, ఔటర్, రీజినల్ రింగ్‌రోడ్లు వస్తున్నాయి. ప్రతి కొత్త రహదారి నిర్మాణం భవిష్యత్‌లో వాహనాల రద్దీని అంచనా వేస్తూ నిర్మాణాల ప్రణాళికలు చేస్తున్నారు.

# చిన్నబోయిన పాలకుర్తి

- మాజీ ఎమ్మెల్యే నెమురుగొమ్ముల ఇకలేరని దిగ్భ్రాంతి

తొర్రూరు/పాలకుర్తి రూరల్/పెద్దవంగర, మార్చి 13: దివంగత మాజీ మంత్రి నెమురుగొమ్ముల యతిరాజారావు తనయుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు(74) బుధవారం రాత్రి కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో తుదిశ్వాస విడిచారు. యతిరాజారావు-విమలాదేవి దంపతులకు 1950, ఏప్రిల్ 3న జన్మించిన ఆయన, వైద్యుడిగా నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడు. హైదరాబాద్ గాంధీ వైద్యశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు.



యశోదలో సుధాకర్‌రావు భౌతికకాయాన్ని సందర్శిస్తున్న ఎర్రబెల్లి, పల్లా, కడియం

### తొలిపోరులోనే ఎమ్మెల్యేగా

1999లో ప్రజాదీవెన కార్యక్రమంతో టీడీపీలో చేరిన ఆయన, అదే సంవత్సరంలో పాత చెన్నూరు (పాలకుర్తి)ని యోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు మధుసూదన్‌రెడ్డిపై గెలుపొందారు. నియోజకవర్గానికి ఎస్సారెస్పీ జలాల తరలింపు, రోడ్లు, స్కూళ్ల అభివృద్ధి, వాటర్ ట్యాంకుల నిర్మాణం, మోడల్ స్కూల్స్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2004 ఎన్నికల్లో దుగ్యాల శ్రీనివాస్‌రావు చేతిలో ఓడిపోయారు. 2009లో పాలకుర్తి నియోజకవర్గం ఏర్పడగా 2010లో తొర్రూరు సభలో ఉద్యమ నేత కేసీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. 2014 ఎన్నికల్లో పాలకుర్తి నుంచి పోటీ చేసి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతిలో ఓడిపోయారు. 2018, 2023 ఎన్నికల్లో దయాకర్‌రావు విజయం కోసం పనిచేశారు. 2023 ఆగస్టు 21న కేసీఆర్ ఆశీస్సులతో రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి ఇటీవలే రాజీనామా చేశారు. 1969లో తెలంగాణ తొలి ఉద్యమంలో పాల్గొన్నారు. మలి దశ ఉద్యమంలో క్రియాశీలంగా పని చేశారు.

### నేడు వడ్డెకొత్తపల్లిలో అంత్యక్రియలు..

గురువారం ఉదయం స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లికి సుధాకర్‌రావు భౌతికకాయాన్ని తీసుకురానున్నారు. అంత్యక్రియలకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరు కానున్నారు. సుధాకర్‌రావు భౌతికకాయాన్ని హాస్పిటల్‌లో ఎర్రబెల్లి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి సందర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన మృతికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, రాపోల్ ఆనందభాస్కర్ సంతాపం తెలిపారు.


బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రివరకూ ఏసీబీ సోదాలు

# పగిలిన అవినీతి పుట్ట

## జమ్మికుంట తహసీల్దార్ రజని అక్రమాస్తులు బట్టబయలు

హనుమకొండతో పాటు ఐదుచోట్ల తనిఖీలు.. మొత్తం అక్రమ ఆస్తుల విలువ రూ.12కోట్లు

ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వెల్లడి.. రజని అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



తహసీల్దార్ రజని ఇంట్లో సోదా చేస్తున్న ఏసీబీ అధికారులు, (ఇన్‌సెట్లో) తహసీల్దార్ రజని

*సుబేదారి/ధర్మసాగర్, మార్చి 13 : హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీకి చెందిన తహసీల్దార్ మార్కాల రజని అక్రమాస్తుల చిట్టా బట్టబయలైంది. ఆమె వద్ద ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు ఏసీబీ దాడుల్లో తేలడంతో ఈ అవినీతి అధికారి కటకటాలపాలైంది. బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి 7గంటల వరకు హనుమకొండలోని ఆమె నివాసంతో పాటు ఐదు చోట్ల తనిఖీలు చేసిన అవినీతి నిరోధక శాఖ, మొత్తంగా సదరు అధికారి రూ.12కోట్ల విలువైన ఆస్తులు కూడబెడినట్లు వెల్లడించి అరెస్టు చేసి ఏసీబీ కోర్టుకు తరలించింది.*

ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఫిర్యాదుల మేరకు హనుమకొండలోని కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలో ఉంటున్న జమ్మికుంట తహసీల్దార్ మార్కాల రజని నివాసంలో ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆరు బృందాలు హనుమకొండలో, గతంలో ఆమె పనిచేసిన ధర్మసాగర్‌లో, అలాగే మిత్రులు, బంధువుల ఇళ్లలో ఏకకాలంలో తనిఖీలు చేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి 7గంటల వరకు సోదాలు కొనసాగాయి. తనిఖీల్లో ఇంటి స్థలాలు, వ్యవసాయ భూముల డాక్యుమెంట్లు, బంగారు ఆభరణాలు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు. రూ.25లక్షల బ్యాంకు బ్యాలెన్స్ ఉన్నట్లు గుర్తించి, అకౌంట్‌ను సీజ్ చేయించారు. ధర్మసాగర్‌లో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి చోటు అనే వ్యక్తి ఇంట్లోనూ సోదాలు చేయగా రజనికి సంబంధించి అతడి వద్ద ఎలాంటి వివరాలు తెలియలేదు. అనంతరం రజని అక్రమ ఆస్తుల వివరాలను ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మీడియాకు తెలిపారు. ప్రభుత్వ విలువ రూ.3కోట్ల 12లక్షలు కాగా బహిరంగ మార్కెట్ విలువ రూ.12కోట్ల అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని వెల్లడించారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటివరకు గుర్తించిన రూ.12కోట్ల అక్రమ ఆస్తుల్లో రెండు అంతస్తుల భవనం, 21 ప్లాట్లు, ఏడు ఎకరాల వ్యవసాయ భూమి, రూ.25లక్షల బ్యాంకు బ్యాలెన్స్, కిలోన్నర బంగారు ఆభరణాలు, రెండు కార్లు, మూడు బైక్‌లు, లక్షన్నర నగదు ఉన్నాయని పేర్కొన్నారు. సోదాల అనంతరం ఏసీబీ అధికారులు హనుమకొండలో తహసీల్దార్ రజనిని బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



పెంబర్తి వద్ద అరూరిని గుంజుకుపోతున్న బీజేపీ యువ మోర్చా జనగామ జిల్లా అధ్యక్షుడు రాజవెంకటనర్సింహారెడ్డి, తోపులాటలో చినిగిన మాజీ ఎమ్మెల్యే అంగీ

# అరూరి చుట్టూ హైడ్రామా

- దళిత మాజీ ఎమ్మెల్యేపై బీజేపీ పెత్తనం
- తమ పార్టీలో చేరాలని పట్టు
- కారులోంచి లాగి దౌర్జన్యం
- తోపులాటలో చినిగిన రమేశ్ అంగీ
- ఉదయం నుంచీ ఉద్రిక్తత

నయీంనగర్, జనగామ రూరల్, మార్చి13 : బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ చుట్టూ హైడ్రామా నడిచింది. తనను బీజేపీలో చేరాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెత్తనం చెలాయించడం, హైదరాబాద్ వెళ్తున్న ఆయనను అడ్డుకొని కారులోంచి లాగి చొక్కా చినిగేలా చేయడం.. ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది.. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఉదయం10గంటలకు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభానికి ముందే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కూడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకన్న చేరుకుని రమేశ్‌తో మాట్లాడుతున్న క్రమంలో బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి వాగ్వాదానికి దిగారు. తర్వాత ఎర్రబెల్లి తన కారులో రమేశ్‌ను హైదరాబాద్ తీసుకెళ్తుండగా జనగామ మండలం పెంబర్తి వద్ద బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అడ్డుకున్నారు. బారికేడ్లు, వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. అంతేకాకుండా కారులోంచి రమేశ్‌ను బయటకు లాగి గుంజుకుపోయే ప్రయత్నం చేశారు. ఈ తోపులాటలో అరూరి అంగీ చినిగింది. వారిని విదిలించుకొని రమేశ్ మాట్లాడుతూ 'నన్ను ఎవరూ బలవంతగా తీసుకుపోతలేరు, నా వ్యక్తిగత పనిమీద వెళ్తున్నా' అని చెప్పినా బీజేపీ నాయకులు వినకుండా హంగామా చేశారు. విషయం తెలిసి పెంబర్తికి చెందిన కొందరు బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి చేరుకొని బీజేపీ నాయకుల చేరలోంచి రమేశ్‌ను విడిపించి హైదరాబాద్‌కు పంపించారు.

